క్లుప్తంగా

మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

నెల్లూరు(టౌన్): స్థానిక సుబేదార్‌పేటలోని సెయింట్ జోన్స్ పాఠశాలలో శుక్రవారం సెయింట్ జోన్స్ ఓల్డ్ స్టూడెంట్స్ ఆర్గనేషన్ (సోసో) ఆధ్వర్యంలో మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. పాఠశాలలో మొత్తం 17 మంది విద్యార్థులకు రూ.69,496, బెంచీలకు రూ.51,300 అందజేశారు. అలాగే ఓ విద్యార్థికి వైద్యసాయం కోసం కొంత మొత్తాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి లయన్ ఎస్ఎస్‌వీ రామ్మోహన్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఆర్గనేషన్ వ్యవస్థాపకులు చంద్రశేఖర్, హెడ్‌మాస్టర్ శాంతి, పూర్వవిద్యార్థులు సాయిప్రసాద్, అజయ్‌కుమార్, సీవీ ప్రసాద్, సునీల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన ఎన్జీఓ నాయకులు



నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మను ఏపీ ఎన్జీఓ నాయకులు శుక్రవారం జెడ్పీ కార్యాలయంలో కలిసి విజయవాడలో జరగనున్న 21వ ఏపీ ఎన్జీఓ రాష్ట్ర మహాసభలకు రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓ నాయకులు పెంచలరావు, నాయుడు వెంకటస్వామి, వెంకటేశ్వర్లు, ఆంజనేయవర్మ, మధు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఏపీఆర్ఎస్ఏ నేతలు



నెల్లూరు(దర్గామిట్ట): కలెక్టర్ ఎం.హరినారాయణన్‌ను ఏపీఆర్ఎస్ఏ నాయకులు శుక్రవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలిశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి కలెక్టర్‌కు పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఆఫీస్ సబార్డినేటర్లకు జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలని, వీఆర్ఏలకు ఆఫీస్ సబార్డినేట్లుగా పదోన్నతులు కల్పించాలని, డీటీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. సాధ్యమైన త్వరలో సమస్యలు పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.డానియేలు పీటర్, పి.మురళి తదితరులు ఉన్నారు.

నేత్ర వైద్యశిబిరం

నెల్లూరు(బృందావనం): నేత్రాలకు సంబంధించి ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని డాక్టర్ నిహారిక తెలిపారు. కొండాయపాళెంరోడ్డులో అబైండింగ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో నేత్ర వైద్యుడు ప్రేమ్‌చంద్, ట్రస్ట్ నిర్వాహకుడు నిర్మలకుమార్, జయప్రకాష్, శివ, క్రాంతి, సిస్టర్ రమ, సిస్టర్ జయ, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



నెల్లూరు(సెంట్రల్):ఆంధ్రప్రదేశ్‌లోని రొయ్యల ఎగుమతిదారులకు సరఫరా చేసే ట్రేడర్స్‌కు సంబంధించి చిన్న చిన్న సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ సీ ఫుడ్ సప్లయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామమూర్తి అన్నారు. నెల్లూరులోని ఓ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ట్రేడర్స్‌కు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఎక్కువ శాతం రాష్ట్రంలోనే రొయ్యలు కొనుగోలు చేసేలా చూడాలని కోరారు. సమావేశంలో ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, కార్యదర్శి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలపై చర్యలు తీసుకోండి



నెల్లూరు(టౌన్): నెల్లూరు నగరంతోపాటు రూరల్ పరిధిలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న నారాయణ జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక స్టోన్‌హౌస్‌పేటలోని కార్యాలయంలో ఆర్ఐఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ మాట్లాడుతూ కొన్ని కళాశాలలు మైదానం, ఫైర్‌సేఫ్టీ లేకుండా నిర్వహిస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుంచి రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి అనుమతులు లేకుండా నారాయణ కళాశాలల్లోనే హాస్టల్స్ నిర్వహిస్తున్నా ఇంటర్‌బోర్డు అధికారులు పట్టించుకోవడంలేదన్నారు.



రొయ్యను పరిశీలిస్తున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

సీ ఫుడ్.. వెరీ టేస్ట్ గురూ..!

నెల్లూరు నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీ ఫుడ్ ఫెస్టివల్‌ను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. మూడ్రోజులపాటు నిర్వహిస్తున్న ఈ ఫెస్టివల్‌లో వివిధ రకాల చేపలు, రొయ్యలు, పీతలతోపాటు నోరూరించే ఆహార ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. మంత్రితోపాటు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఆప్కాఫ్ చైర్మన్ అనిల్‌బాబు, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్ స్టాళ్లను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నగర ప్రజలు సీ ఫుడ్ ఫెస్టివల్‌ను సందర్శించి స్టాళ్లలోని ఆహార పదార్థాలను రుచి చూసి 'సీ ఫుడ్.. వెరీ టేస్ట్ గురూ.. అంటూ కితాబునిచ్చారు.

– నెల్లూరు(దర్గామిట్ట)



నేనూ.. నా చేప.. అంటూ సెల్ఫీ దిగుతున్న యువతులు



సీ ఫుడ్ ఫెస్టివల్‌లో ఏర్పాటు చేసిన స్టాల్

నేడు దేశభక్తి గీతాలు, నృత్య పోటీలు

నెల్లూరు(బృందావనం): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నగరంలోని పురమందిరం ప్రాంగణం వర్ధమాన సమాజం సమావేశ మందిరంలో ఆదివారం సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు కృష్ణ కల్చరల్స్ ఆధ్వర్యంలో దేశభక్తి గీతాలు, నృత్య పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ ట్రస్ట్ అధ్యక్షుడు బి.కృష్ణ శుక్రవారం తెలిపారు. అనంతరం విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే మహిళలకు చీరల పంపిణీ, చిన్నారులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 89780 59422 ఫోన్‌నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

రేపు 3 కె రన్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏపీఎల్ (2వ సీజన్) ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెల 13వ తేదీన నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నుంచి ఉదయం 8 గంటలకు ఏపీఎల్ 3 కె రన్ నిర్వహిస్తున్నట్లు నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీవీఎస్ మూర్తి, సెక్రటరీ నిఖిలేశ్వరరెడ్డి శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16వ తేదీన వైజాగ్‌లో జరిగే ఆంధ్రప్రదేశ్ క్రికెట్ లీగ్ ప్రారంభం సందర్భంగా రాష్ట్రంలోని 13 జిల్లాల్లో 3 కె రన్ ఆయా జిల్లాల హెడ్ క్వార్టర్స్‌లో జరుగుతుందని తెలిపారు.

కేపీసీలో న్యాయ విజ్ఞాన సదస్సు

నెల్లూరు(టౌన్): స్థానిక స్టోన్‌హౌస్‌పేటలోని కేపీసీ జూనియర్ కళాశాలలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన, నిరక్షరాస్యత, వైకల్యం ఉన్న వ్యక్తులకు ఉచిత న్యాయం అందించాలన్న ఉద్దేశంతో 1987లో న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటైందని తెలిపారు. అలాగే 1997లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ర్యాగింగ్ నిరోధక చట్టాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ చట్టంలో పొందుపరిచిన విధివిధానాలను విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, అధ్యాపకులు, కళాశాల యాజమాన్యాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ర్యాగింగ్ ద్వారా అవమానించడం, బాధించడం జరిగితే 6 నెలల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, లక్ష్మీప్రసాద్, డాక్టర్ భాస్కర్, ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వాణి

సెప్టెంబర్ 19 నుంచి వినాయకచవితి ఉత్సవాలు

- గణేష్ ఘాట్ వద్ద నిమజ్జనోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలి
- విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి

నెల్లూరు(బృందావనం): సెప్టెంబర్ 19 నుంచి 23వ తేదీ వరకు నెల్లూరు నగరంలో వినాయకచవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు పిట్టి సత్యనాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పి.సురేంద్రరెడ్డి తెలిపారు. నగరంలోని ట్రంక్‌రోడ్డు గాంధీబొమ్మ వద్ద ఉన్న టీవీఎస్ కల్యాణ సదన్‌లో విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం వినాయకచవితి నిర్వహణకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం నెల్లూరు చెరువు వద్ద శ్రీస్వర్ణ లింగేశ్వరస్వామి ఆలయం సమీపంలో ఉన్న గణేష్ ఘాట్‌లో నిమజ్జనోత్సవానికి, భక్తుల సౌకర్యార్థం తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. నెల్లూరు చెరువును పరిశుభ్రం చేయాలని, పారిశుద్ధ్యం మెరుగుపరచాలని, విద్యుదీకరణ చేపట్టాలన్నారు. విగ్రహాల నిమజ్జనం కోసం క్రేన్‌ల ఏర్పాటు, చెరువులో గుర్రపుడెక్క తొలగించడం, గణేష్ ఘాట్‌లో మరమ్మతులు చేయడం, గణేష్ విగ్రహంతో స్వాగత చిహ్నం ఏర్పాటు చేయడం, స్వాగత వేదిక, సాంస్కృతిక వేదికలు ఏర్పాటు చేసి మైక్, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులకు ఏ సమస్య వచ్చినా కలెక్టర్, ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి ఆయా సమస్యల పరిష్కారానికి సమితి కృషి చేస్తుందన్నారు. సమావేశంలో విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి కోశాధికారి ఏవీఆర్ మోహన్‌రావు, నిర్వాహకులు గడ్డం విజయకుమార్, మండ్ల ఈశ్వరయ్య, టి.భాస్కరరెడ్డి, కొండపల్లి శ్రీకాంత్, హర్షవర్ధన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిట్టి సత్యనాగేశ్వరరావు, పి.సురేంద్రరెడ్డి తదితరులు

తెలంగాణ జలచౌర్యాన్ని అడ్డుకోవాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): శ్రీశైలంలో తెలంగాణ జలచౌర్యాన్ని అడ్డుకోవాలని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నెల్లూరులో తెలుగుగంగ ఎన్‌టీపీ ఎ.రాంప్రసాదుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. శ్రీశైలం జలాశయంలో ఈ సంవత్సరం వరద ప్రవాహం తక్కువగా ఉందన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు, తెలుగుగంగ, గాలేరు నగరిహంద్రీనీవా ఎస్ఆర్‌బీసీలకు నీరు విడుదల చేసే సమయంలో తెలంగాణ సర్కార్ అనుమతులు లేకుండా చట్టవ్యతిరేకంగా ఎడమ విద్యుత్ కేంద్రం నుంచి నిరంతరాయంగా నీటిని తరలిస్తోందన్నారు. ఈ కారణంగా రాయలసీమ, నెల్లూరు రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీశైలంలో ముందుగా సాగునీరుకు ప్రాధాన్యం ఇచ్చి ఆ తరువాత జల విద్యుత్ ఉత్పత్తి చేసుకోవాలన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న మిడతల రమేష్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపు పనుల నేపథ్యంలో శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ నెల్లూరు టౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- నవాబుపేట రైతుబజారు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురం, ఆర్ఎస్ఆర్ స్కూల్, శెట్టిగుంట రోడ్డు, రామచంద్రాపురం, తడికలబజారుసెంటర్, వీవర్స్‌కాలనీ, ముకుందాపురం, విజయగోపాలపురం పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు..
- వైఎంసీఏ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆచారి వీధి, కలెక్టరేట్ ప్రాంతం, రాయాజీవీధి, ముంగమూరి వారి వీధి, మద్యపతి వారి వీధి పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు..
- కోటమిట్ట విద్యుత్ సబ్‌స్టేషన్, కోటమిట్ట సెక్షన్ పరిధిలోని ఖుద్దూస్‌నగర్, మన్సూర్‌నగర్, సిటిజన్ స్కూల్, జెండావీధి, కామాటివీధి, గిడ్డంగివారివీధి, సవరాల వారివీధి పరిసర ప్రాంతాల్లో ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు..
- హరనాథపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని హరనాథపురం, సర్వేపల్లి కాలువకట్ట, ఆదిత్యానగర్, అపోలో హాస్పిటల్, సాక్షి ఎడిషన్ కార్యాలయం, మెడికవర్ హాస్పిటల్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు..
- డీఎస్సార్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని జెడ్పీకాలనీ, పోస్టల్‌కాలనీ, గౌతమినగర్, నేతాజీనగర్, పొదలకూరురోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు..
- జగదీష్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని బాలాజీనగర్, గొడ హాస్టల్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు..
- రంగనాథ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని రైల్వే ఫీడర్స్ రోడ్డు, ఇసుకడొంక, కపాడిపాళెం, రంగనాయకులపేట పరిసర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు.. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని తెలిపారు.

రూరల్‌లో..

నెల్లూరు రూరల్: కొత్తూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కొత్తూరు, శ్రామికనగర్, చంద్రబాబునగర్, వైఎస్సార్ నగర్, అంబాపురం, రామకోటయ్యనగర్, పోలీసుకాలనీ, అక్కచెరువుపాడు, ఒగూరుపాడు, రాజీవ్ స్వగృహ, టైలర్స్‌కాలనీ ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ శివశంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్ర అధ్యక్ష పదవికి రాజీనామా

నెల్లూరు(బృందావనం): ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష పదవికి తాను రాజీనామా చేస్తున్నట్లు ఉరందూరు సురేంద్రబాబు నెల్లూరులో శుక్రవారం తెలిపారు. ఈ మేరకు ఏఐసీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దపాటి విజయరాజుకు తన రాజీనామా పత్రం పంపినట్లు ఆయన తెలిపారు. వ్యక్తిగత కారణాలతో ఈ బాధ్యతల నుంచి తాను తప్పుకుంటున్నట్లు సురేంద్రబాబు తెలిపారు.

సచివాలయం తనిఖీ



సచివాలయ ఉద్యోగులకు సూచనలిస్తున్న కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు సిటీ: నగరంలోని 26, 27వ డివిజన్లకు సంబంధించి ఓల్డ్ గిరిజన కాలనీలో ఉన్న సచివాలయాన్ని కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ శుక్రవారం తనిఖీ చేశారు. సచివాలయంలోని రిజిసర్లు, నోటీసు బోర్డు, స్పందన రిజిస్టర్లను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న సేవలను గడువు లోపు పరిష్కరించాలని సూచించారు. ఎస్‌డీజీ సర్వే, భూహక్కు సర్వే, ఏపీ సేవా పోర్టల్ అంశాలపై ప్రత్యేక దృష్టసారించి యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని తెలిపారు.


కమిషనర్ పర్యటన

నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కొత్తూరు ఎన్జీఓ కాలనీల్లో స్థలాలను ఆక్రమించుకుని తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకున్న నిర్వాసితులకు అర్హతలను బట్టి కార్పొరేషన్ పరిధిలోని టిడ్కో గృహ సముదాయాల్లో ఇళ్లను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. బుజబుజనెల్లూరు ప్రాంతంలో తాగునీటి సరఫరాకు సంబంధించి నీటిశుద్ధి యంత్రాలకు వెంటనే మరమ్మతులు చేయాలని, ప్రజలకు తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

టిడ్కో గృహాలకు దరఖాస్తు చేసుకోండి

- నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు సిటీ: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఏపీ టిడ్కో గృహ సముదాయాల్లోని వెంకటేశ్వరపురం, అల్లీపురం, అక్కచెరువుపాడు, కల్లూరుపల్లి ప్రాంతాల్లో గృహాలకు అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ వికాస్ మర్మత్ సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గృహాలు కేటాయించిన లబ్ధిదారులు కొంతమంది మాత్రమే రిజిస్ట్రేషన్‌కు ముందుకువచ్చారని తెలిపారు. గృహాలు తీసుకునేందుకు అయిష్టత చూపిన లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్లు రద్దు చేసి కొత్త వారిని ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో టిడ్కో ఈఈ ఉమాశంకర్‌శాస్త్రి, మెప్మా పీడీ రవీంద్ర, పెంచలయ్య, జరీనా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ వికాస్ మర్మత్

నేడు అన్నమయ్య సంకీర్తనావళి

నెల్లూరు(బృందావనం): శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్య జయంత్యుత్సవ కమిటీ, శ్రీవాణి శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో శనివారం శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల 614వ జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆ కమిటీ ముఖ్య సమన్వయకర్త, లాయర్ వారపత్రిక సంపాదకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను శుక్రవారం మాగుంటలేఅవుట్‌లోని ఆ పత్రిక కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్థం, ఆలాపన, అభినయంతో అన్నమయ్య సంకీర్తనావళి కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. శనివారం సాయంత్రం 6 గంటలకు మినీబైపాస్‌రోడ్డులోని అన్నమయ్య సర్కిల్‌లోని అన్నమాచార్యుల విగ్రహం వద్ద పూజా కార్యక్రమాలు చేపట్టిన అనంతరం అక్కడి నుంచి పీవీఆర్ కల్యాణ మండపం వరకు నగర సంకీర్తన సాగుతుందన్నారు. శ్వేత మాజీ సంచాలకులు భూమన్ భావవ్యక్తీకరణ వివరిస్తారన్నారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారుడు కె.సరస్వతీప్రసాదు గానాలాపన, నెల్లూరు శ్రీగురుకృప కళాక్షేత్రం విద్యార్థినుల నాట్యారాధన ఉంటుందని తెలిపారు. అనంతరం తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో కార్యనిర్వాహక సభ్యులు నలుబోలు బలరామయ్యనాయుడు, దండమూడి హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న శివప్రభాత్‌రెడ్డి తదితరులు

స్వర్ణాల చెరువు పరిశీలన

నెల్లూరు సిటీ: కేంద్ర, రాష్ట్ర సూచనల మేరకు రివర్ ఫ్రంట్ డెవెలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలోని స్వర్ణాల చెరువు అభివృద్ధికి ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ చీఫ్ ఆర్కిటెక్ట్ కిరణ్‌కుమార్, కమిషనర్ వికాస్ మర్మత్ అధికారులకు సూచించారు. స్వర్ణాల చెరువు వద్ద ఇంజినీరింగ్ అధికారులతో కలిసి శుక్రవారం పర్యటించారు. స్వర్ణాల చెరువు తీరంలో నడకమార్గం, ప్రహరీలు, వ్యర్థాల నుంచి తయారీ చేసిన ఉత్పత్తుల ప్రదర్శన గజిబో, మోరల్ ఆర్ట్స్ తదితర నిర్మాణాల ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



స్వర్ణాల చెరువు గురించి వివరిస్తున్న కమిషనర్

